క్లుప్తంగా

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్లు

కోల్‌సిటీ: ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటేనే వ్యాధిని నియంత్రణ సాధ్యమవుతుందని జీజీహెచ్ ఆస్పత్రిలోని ఎయిడ్స్ నివారణ అనుబంధ సంస్థలు ఐసీటీసీ, పీపీటీసీ సంస్థ కౌన్సిలర్లు శంకర్, విజయ అన్నారు. మంగళవారం గోదావరిఖనిలోని పలు డిగ్రీ కాలేజీల విద్యార్థులకు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించారు. వ్యాధి రావడానికి కారణాలు, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. వ్యాధి సోకినవారు భయాందోళనలకు గురికావద్దని, సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ముఖ్యంగా యువత ఎయిడ్స్‌కు గురవుతుండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పద్మపాని ఎన్జీఓ దివ్యతోపాటు ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

సుల్తానాబాద్: యాసంగి సీజన్‌కు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి బూర్గు సంతోష్‌కుమార్ తెలిపారు. అవసరం ఉన్న రైతులు సహకార సంఘం గోదాం వద్దకు వెళ్లి ఎంటీయూ 1010 రకం రూ.820, 25 కిలోల బస్తాలు అందుబాటులో ఉన్నాయని, పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశానికి కోరం సభ్యులు హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

మద్యం షాపులు బంద్



సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సుల్తానాబాద్: 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం షాపులు బంద్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లాలో ఉన్న మద్యం షాపులు, బార్లు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత డిసెంబర్ ఒకటో తేదీన ఓపెన్ చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో ఉన్న మద్యం షాపులను మూసివేసినట్లు ఎక్సైజ్ సీఐ ఆనందరావు తెలిపారు. మద్యం అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

సుల్తానాబాద్: పట్టణంలోని రాజీవ్ రహదారిపై రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ అవుతోందని 'సాక్షి'లో కథనం ప్రచురితమైనది. కమిషనర్ మల్లికార్జున్ చొరవ తీసుకొని మరమ్మతు చేయలని మున్సిపల్ కార్మికులను ఆదేశించారు. మంగళవారం మరమ్మతు పనులు ప్రారంభించారు.

రంగులు వేయండి ప్లీజ్



జూలపల్లి: చదువుల తల్లి సరస్వతీ మాత విగ్రహన్ని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ముందు దాత సాయంతో ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తయి సంవత్సరం కావస్తున్నా, రంగులు వేయక పోవడంతో అసంపూర్తిగా ఉండి ఆవిష్కరణకు నోచుకోలేదు. దాతలు ముందుకు వచ్చి రంగులు వేసి సరస్వతీ మాత విగ్రహానికి తుదిరూపు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

గుంతల రోడ్లపై పోవుడెట్లా?

- దశాబ్దాలుగా మరమ్మతుకు నోచుకోని రహదారులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలు



అధ్వానంగా వెన్నంపల్లి - ఇదులాపూర్ రోడ్డు



గుంతలమయంగా కాల్వశ్రీరాంపూర్-పాత్కపల్లి రోడ్డు (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. కాల్వశ్రీరాంపూర్ మండలంలో దశాబ్దాల కింద వేసిన ఆర్అండ్‌బీ రహదారులు మరమ్మతుకు నోచుకోక ప్రయాణికులు ఇబ్బందుల పాలవుతున్నారు. మండలంలోని వెన్నంపల్లి వయా జాఫర్‌ఖాన్‌పేట ఆర్అండ్‌బీ రోడ్డు, కాల్వశ్రీరాంపూర్ వయా పందిల్ల పాత్కపల్లి ఆర్అండ్‌బీ రోడ్లు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రోడ్డు గుంతలమయం..

వెన్నంపల్లి–ఇదులాపూర్ రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. వ్యవసాయ రైతులు ట్రాక్టర్లపై, ఎడ్లబండ్లపై తమ వ్యవసాయ ఉత్పత్తులను పంటపొలాల నుంచి ఇళ్లకు చేరవేసే క్రమంలో గుంతల రహదారిపై ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు బోల్తాపడిన సంఘటనలు ఉన్నాయి. పాలకులు, అధికారులు ఈ రహదారులకు మరమ్మతు పనులు చేపట్టి ప్రయాణికులుకు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని ఈప్రాంతాల ప్రజలు అధికారులను, పాలకులను కోరుతున్నారు.

గుంతలు ఏర్పడ్డాయి



వెన్నంపల్లి నుంచి వయా జాఫర్‌ఖాన్‌పేట ఇదులాపూర్ రహదారిపై అనేక గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు మరమ్మతుకు నోచుకోవడం లేదు. పలుమార్లు వాహనాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. గుంతలు ఏర్పడిన రహదారులపై ప్రయాణం చేయలేక పోతున్నాం.

– పోగాకు శ్యాంసుందర్, మంగపేట

ప్రయాణం నరకం



కాల్వశ్రీరాంపూర్ నుంచి వయా పాత్కపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడి ప్రయాణం చేయలేక పోతున్నాం. అనేక ఏళ్ల కిందట నిర్మించిన ఈ రహదారిపై ప్రయాణం నరకంగా మారింది. అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేసి వదిలేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు చేపట్టాలి.

– పంచిక కుమార్, పందిల్ల

పోలింగ్ కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న కమిషనర్ మల్లికార్జున్



మూత్రశాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

సుల్తానాబాద్: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్ గౌడ్ తనిఖీ చేశారు. పట్టణంలోని పలు కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఓటరు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించినట్లు వివరించారు. పోలింగ్ జరిగే కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వినియోగించుకునే వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయని, వారిని సురక్షితంగా ఓటువేసేలా తమ సిబ్బంది సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

సుల్తానాబాద్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పూసాల, సుగ్లాంపల్లిలో మూత్రశాలలను శుభ్రం చేశారు. ఆయన వివరించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సిబ్బందికి అందుబాటులో ఉంచామని, విద్యుత్ మరమ్మతు చేయడంతో పాటు సిబ్బందికి అవసరమున్న సామగ్రి అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

ముగిసిన ప్రచారం.. పోలింగ్‌కు సిద్ధం



మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ పార్టీలు హోరాహోరీగా చేసిన ప్రచారం నేటితో ముగిసింది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు తమదైన ముద్రతో మేనిఫెస్టోలు విడుదల చేసి, ఇంటింటి ప్రచారంతో పాటు కరపత్రాలు పంపిణీ చేసి ఆకట్టుకునే ప్రయత్నాలు చేశాయి. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో, బీఆర్ఎస్ కేసీఆర్ భరోసాతో, బీఎస్పీ బహుజనుల అభివృద్ధే ధ్యేయంగా, బీజేపీ అభివృద్ధి నినాదంతో ప్రచారాన్ని హోరెత్తించాయి.

పోలింగ్‌కు సర్వం సిద్ధం..

ఈ నెల 30న నిర్వహించే ఓటింగ్ కోసం మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కొత్త ఓటర్లను కలుపుకుని పురుషులు 10,806, మహిళలు 10,948 మంది ఓటర్లు ఓటు వేసేందుకు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 వరకు సమయం ఇచ్చినా, 5లోపు క్యూలో ఉన్నవారు ఓటు హక్కును వినియోగించుకునే వరకు గడువిస్తారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలైన తాగు నీరు, విద్యుత్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. నేడు పోలింగ్ సిబ్బంది మండల కేంద్రానికి రానున్నందున అధికారులు వీరికి అవసరమైన సౌకర్యాలు పూర్తి చేశారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు దేశానికే ఆదర్శమని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మారం మండల కేంద్రంతో పాటు మండలంలోని నందిమేడారంలో మంగళవారం ఆయన ప్రచారం చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ సీఎం అయిన తర్వాత రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. సర్పంచు పుస్కూరి జితేందర్ రావు, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో మోసం

వెల్గటూర్: ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేయాలని చూస్తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఎండపల్లి మండల కేంద్రంతో పాటు, గొడిశెలపేటలో ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్నారు. మంత్రికి ఎండపల్లిలో నిరుద్యోగుల నుంచి నిరసన ఎదురైంది. పోలీసులు యువకులను పక్కకు తొలగించారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి



ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: ఎన్నికల్లో ఓడినా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతున్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ధర్మపురి అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మారం మండలం గోపాల్‌రావుపేట, నందిమేడారంలో మంగళవారం పార్టీ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ధర్మారం మండలం గోపాల్‌రావుపేట మాజీ సర్పంచు చింతల జగన్మోహన్‌రెడ్డి, కొత్తూరు ఎంపీటీసీ తాళ్లపెల్లి భద్రమ్మ, లింగయ్య తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ కోడారి అంజన్న, ఎంపీటీసీలు లక్ష్మి, రాజయ్య, పార్టీ నాయకులు అరిగె లింగయ్య, చిప్ప మణిశర్మ, మాజీ సర్పంచులు కొత్త నర్సింహం, స్వామి, మల్లేశం, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్గటూర్: దళితులంటే మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడారు.

పెగడపల్లి: పెగడపల్లిలో మంగళవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో లక్ష్మణ్‌కుమార్ ప్రసంగించారు.

చెరువంతా గుర్రపు డెక్క



సుల్తానాబాద్: పట్టణంలోని పూసాలలో ఉన్న చెరువు గుర్రపు డెక్కతో నిండిపోయింది. గుర్రపు డెక్క తొలగించి శుభ్రం చేయాలని ముదిరాజ్‌లు అధికారులను కోరుతున్నారు.



కుంగుతున్న కెనాల్ బ్రిడ్జి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ నుంచి గట్టెపల్లి వెళ్లే రహదారి మధ్యలో ఎస్సారెస్పీ కాలువ మీద ఉన్న బ్రిడ్జి ఓవర్ లోడ్ లారీలతో కుంగిపోతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఓవర్ లోడ్ లారీలు కెనాల్ బ్రిడ్జిపై నుంచి వెళ్లకుండా నిషేధం విధించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆకర్షణ కోల్పోతున్న కళాకృతి



రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంపై ఉన్న కళాకృతి అందం, ఆకర్షణ కోల్పోతోంది. దశాబ్దకాలం క్రితం పెద్ద వేపవృక్షం ఉండగా రైల్వేస్టేషన్ విస్తరణ పనుల్లో అడ్డుగా ఉండడంతో మొదల్లో నుంచి తొలగించకుండా పది అడుగులు వదిలిపెట్టి వృక్షాన్ని కట్ చేశారు. మిగతా కొమ్మను మళ్లీ చిగురించకుండా రసాయనాలతో చర్యలు తీసుకున్నారు. అనంతరం దానికి మంచి రంగులతో స్వాగత తోరణంగా మహిళా కళాకృతిని తీర్చిదిద్దారు. దీంతో ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తూ సెల్ఫీలు తీసుకున్న సందర్భాలు అనేకం. ప్రస్తుతం కళాకృతికి రంగులు వేయకపోవడంతో కళావిహీనంగా మారుతోంది. దీనిపై సంబంధిత రైల్వే అధికారులు స్పందించి ప్లాట్‌ఫారంపై ఉన్న కళాకృతిని రంగులతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మీసేవలో నాగుపాము



మీసేవ కేంద్రంలో నాగుపాము

జ్యోతినగర్(రామగుండం): మీ సేవ కేంద్రంలో నాగుపాము హల్‌చల్ చేసింది. మంగళవారం ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని మీ సేవ కేంద్రంలో ఓ నాగుపాము చొరబడింది. సిబ్బందితో పాటు కస్టమర్లు దానిని చూసి పరుగులు పెట్టారు. అనంతరం పాములను పట్టే వ్యక్తి వచ్చి నాగుపామును పట్టుకున్నాడు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



రోడ్డుపైకి ఏపుగా పెరిగిన మొక్కలు

రామగుండం: రాజీవ్ రహదారి ఐబీసీ బస్టాప్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో వేచి ఉండే ప్రయాణికులకు కరీంనగర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కనిపించకపోవడంతో పాటు షెల్టర్‌లో ఉన్న ప్రయాణికులను గుర్తించక బస్సు డ్రైవర్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా రాజీవ్ రహదారిపై వేగంగా రాకపోకలు సాగించే వాహనాలతో కలిసి ఆర్టీసీ బస్సు వస్తున్న క్రమంలో బస్‌షెల్టర్ దగ్గరికి వచ్చాక మాత్రమే ప్రయాణికులను గుర్తిస్తే ఆపలేని పరిస్థితి. ప్రయాణికులు సైతం దూరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సును గుర్తించలేకుండా రోడ్డుపైకి ఏపుగా మొక్కలు పెరిగాయి. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైకి పెరిగిన మొక్కల కొమ్మలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఆకట్టుకుంటున్న బెలూన్

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయ భవనంపై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు గ్యాస్ బెలూన్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలతో ఏర్పాటు చేశారు. 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదాన్ని ఆ బెలూన్‌పై రాశారు. ఈనెల 30న గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు దానిపై పేర్కొన్నారు. భారీ సైజుతో ఎత్తులో ఉన్న ఈ బెలూన్ అందరినీ ఆకట్టుకుంటోంది.

శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో జిల్లా జడ్జి



పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న పూజారి

రామగుండం: కార్తీకమాసం పురస్కరించుకొని అబాది రామగుండం శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో మంచిర్యాల జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు ఆలయాన్ని సందర్శించి లింగార్చన పూజలు చేశారు. కాగా ఆలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జికి ఆలయ కమిటీ పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి బుగ్గ శ్రీనివాస్‌శర్మ తదితరులున్నారు.